

ఆదివారం రాత్రి భక్తులతో నిండిన శ్రీవారి పాత కల్యాణ మండపం

## తొలిరోజు శ్రీవారి దర్శనానికి..

ద్వారకా తిరుమల, డిసెంబరు 31 : నూతన సంవత్సరం తొలిరోజు శ్రీవారిని దర్శించాలని కొందరు, ఈ ఏడాది ఆఖరిరోజున దర్శనం కోసం మరికొందరు రావడంతో శ్రీవారి క్షేత్రం ఆదివారం రాత్రి భక్తులతో కళకళ లాడింది. పలుప్రాంతాల నుంచి పాదయాత్రగా ఆలయానికి చేరుకున్న భక్తులు స్థానిక పాత కల్యాణ మండప ఆవరణలో సేదతీరారు. కొందరైతే మొక్కుబడులు తీర్చుకుని సోమవారం ఉదయం శ్రీవారి తొలిదర్శనం చేసుకునేందుకు రాత్రి ఆలయ ప్రాంగణంలోనే బస చేశారు. నూతన సంవత్సరం తొలిరోజు శ్రీవారిని దర్శించుకుంటే ఆఏడాది నిండుగా శుభాలు జరుగుతాయన్నది భక్తుల నమ్మకం.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఏలూరు కలెక్టరేట్/ఏలూరు క్రైం, డిసెంబరు 31 :

- నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ బి.లావణ్యవేణి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ప్రతి ఒక్కరి జీవితంలో నూతన కాంతులు నింపాలని కోరుతూ జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి వారు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంచి పంటలు పండి పారిశ్రామికపరంగా జిల్లా అభివృద్ధి సాధించాలని వారు కోరారు.
- ప్రజలందరూ ఆనందోత్సాహాలతో నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో నూతన సంవత్సరం గడపాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆకాంక్షించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.



## మద్యం దుకాణాల వద్ద రద్దీ

ఏలూరు క్రైం : ఏలూరు నగరంలో నూతన సంవత్సర వేడుకల సందడి కన్పించింది. నగరంలో పోలీసులు ఎక్కడికక్కడ పికెట్లను ఏర్పాటు చేశారు. కొంత మంది వాహనాలకు సైలెన్సర్లు పెట్టి అల్లరిచిల్లరిగా తిరగడాన్ని గమనించి ఎక్కడికక్కడ స్టాపర్లను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. మరోవైపు అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు ఉండడంతో మద్యం షాపుల వద్ద మద్యం ప్రియులు బారులుదీరారు. ఒక్కొక్కరు నాలుగైదు బాటిళ్లు బహిరంగంగా పట్టుకెళ్లడం విశేషం. బార్లను ఒంటిగంట వరకూ తెరచి ఉంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించడంతో అక్కడ కూడా రద్దీ నెలకొంది. అనేక ప్రాంతాల్లో బహిరంగంగానే మద్యాన్ని తాగారు.




# కొత్తగా.. సరి కొత్తగా..

**ఎన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలు. గతేడాది అనుభవాలను నెమరేస్తూ.. చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ నూతన సంవత్సరంలో అడుగెడుతున్న వేళ సరికొత్త ఆలోచనలు.. మరెన్నో ఊసులు. ఈ ఏడాది రాజకీయ జాతక చక్రం తిప్పబోతోంది. అష్టకష్టాల కోర్చిన జనం ఇచ్చే తీర్పేంటి ? రైతన్న ఏడాది పొడవునా సజావుగా సాగు చేయబోతున్నారా ? ఇప్పటికే పట్టరాని ఆగ్రహంతో ఉన్న కుర్రకారు ఉపాధి ఆశల సౌధాన్ని అందుకుంటారా.. మహారాణుల్లా చలామణి అయ్యే ఆడపడుచుల ఆలోచనల్లో మార్పులు, చేర్పులు ఉండబోతు న్నాయా ? ధరవరలు దిగొస్తాయా ? ఇవన్నీ ఆలోచనలే. ముంచుకొస్తున్న మహమ్మారి కరోనాను జయించే దిశగా నూతన సంవత్సరం వేళ అందరి ఎదుట సరికొత్త సవాల్.**

-ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి





ఏలూరు వన్‌టౌన్‌లో పూల దుకాణం వద్ద..

పాత ఏడాది గడిచిపోయింది. అనేక జ్ఞాపకాలు మిగిల్చిపోయింది. ఎంతమందో కష్టాల కోర్చారు.. మరెంత మందో అసువులుబాశారు.. చేలల్లోనే రైతన్న నేలకొరిగాడు.. ధరవరలు మధ్య తరగతిని ముప్పేట ముంచాయి. మూడొంతులు రాజకీయ వరసే సాగింది. కేసు అంటే మచ్చుకైనా తెలియని వారిపై హత్యాప్రయత్నాల నమోదు, ఇంటి స్థలం దగ్గర నుంచి సాగుచేసే చేను వరకు వివాదాలమయం. అధికార పక్షం లెక్కలేనితనం. జనం అన్ని పార్టీల హామీలు చూశారు, వాగ్దానాలు విన్నారు. గతుకులు, గుంతలు రోడ్లలో ప్రాణాలు కోల్పోయినవారెందరో. సహనం కోల్పోయి సర్కారు పైనే ఉద్యోగుల దండయాత్రలు. పిడికిలి బిగించిన కార్మికులు. మూతపడిన పరిశ్రమలు. పడకేసిన పథకాలు. గడిచిన ఏడాదిలో దళారీలదే రాజ్యం. పైసా పెట్టుబడి లేకుండా లక్షలు వెనుకేశారు. పాదర్శకమంటూనే పైసలు లేకుండా పనులు జరగలేదు. బటన్ నొక్కుడు మాయలో పడి పేద జనం కొత్త సినిమా చూశారు. ముఖ్యుల సభల్లో సిత్రాలు చూశారు. మాయమాటలు ఆలకించారు. ఇదంతా గడిచిన రోజుల్లో నిలిచిన అనుభవాలు.

కొత్త ఏడాది ఆరంభం కానుంది. గతేడాది అనుభవాలు నెమరేసుకుంటూ ముందుకెళ్లే మార్గం కోసం ఆలోచనలకు



పదును పెడుతున్నారందరూ. గడిచిన సంవత్సరం సగం రోజులు రాజకీయ కక్షలు, చర్చలతోనే సరిపోయింది. ఈ ఏడాది రెండో త్రైమాసికంలోపు సాధారణ ఎన్నికలు రాబోతున్నాయి. పాలకులకు అగ్ని పరీక్ష పెట్టబోతుంది. సవాళ్లు, ప్రతిసవాళ్ల మధ్య చివరి అంకానికి నూతన ఏడాదే ఒక మైలురాయి కాబోతుంది. ఇప్పటివరకు అధికారం ఒలకబోసిన వారినే ఎన్నుకుంటారో.. మార్పు కోరి కొత్త ముఖానికి కిరీటాన్ని పెట్టబోతున్నారో మరికొద్ది నెలల్లోనే తేలనుంది. ఆయా పార్టీల విసురే తాయిలాల కోసం ఇప్పటి నుంచే ఎదురుచూసేది కొంతమంది అయితే మరికొంతమంది ఓటు రూపంలో నిగ్గు తేల్చేయాలనుకుంటున్నారు. కొత్త ఏడాది తమకంతా కలిసి వస్తుందని, పార్టీలో కోపతాపాలు చల్లారతాయని, ప్రజలు తమకే దీవెనలు అందిస్తారని కోటి ఆశలతో.. కోట్లు కొద్ది ధనం వెదజల్లేందుకు అధికార పక్షం వైసీపీ అంతా సిద్ధం చేసుకుంది. అక్రమ కేసులతో విసిగిపోయి, వేధింపులు, ఒత్తిళ్ల నుంచి బయట పడాలని, స్వేచ్ఛా జీవితం కావాలనుకునే వారంతా ఉప్పెనలా తమకు మద్దతు ఇవ్వబోతున్నారని తెలుగుదేశం- జనసేన ఆశల్లో ఉన్నాయి. మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, అనేక సామాజిక వర్గాల్లో తమకు అనుకూలత, సానుకూల గాలులు వీస్తున్నాయని, మండు వేసవి నాటికి రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మార్చినట్టే ఈ గాలులన్నీ తమవైపు చల్లని గెలుపు గాలులు వీస్తాయని ఇరు పార్టీలకు చెందిన వారంతా ఎంతో ఆశతో ఉన్నారు. ఇంతకాలం ప్రజల కోసం కష్టపడ్డాం, ఉద్యమాల్లో

## నూతన సంవత్సరానికి ఆశలతో స్వాగతం

- పాత ఏడాదికి బైబై
- ఎన్నికల నామ సంవత్సరమిది
- జాతకాలు తేల్చేది ఈ ఏడాదే
- సరికొత్త బాట వైపుగా యువత, మహిళలు
- ఆశలు, ఆకాంక్షలకు ఇదే సరికొత్త వేదిక

భాగస్వాములయ్యాం, అనేక మందిని కోల్పోయాం, తాము కూడా బరిలోకి దిగి ప్రజా మద్దతు కూడగట్టుకుంటామనే భావనలో వామపక్షాలు ఉన్నాయి. ఎటు తిరిగి మార్పులు, చేర్పులు కారణంగా కొత్త ఏడాది కాంగ్రెస్‌కు సరికొత్త ఊపిరినే ఇచ్చింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో పార్టీ పూర్తిగా చతికిలపడిన తరుణంలో కొత్త ఏడాది తమకు కలిసొస్తుందని, తాము మిగతా ప్రధాన పార్టీల మాదిరిగానే తమ గ్రాఫ్ పెంచుకోబోతున్నామనే ఆశ లోకంలో కాంగ్రెస్ తేలియాడుతోంది. వివిధ రాష్ట్రాల్లో తిరుగులేని విజయాలను అందుకుం టున్న తాము ఈసారి ఏపీలోను కాషాయం ఎగరేస్తామన్న ఆశలు.. ఎత్తులు, పొత్తులు.. మధ్య భారతీయ జనతా పార్టీ లెక్కలతో మునిగి తేలుతోంది. ప్రత్యేకించి జనం కొత్త ఏడాది లెక్కలు తేల్చేందుకు సంసిద్ధం.

### అందరికి కలిసొచ్చేనా..

కొత్త అడుగులు.. కొత్త ఆశలు. వీటి నడుమ మధ్య తరగతి బడ్జెట్‌లో తరుగుదల, ఎదుగుదల. తగ్గట్టుగానే కుటుంబాల వారీగా అనేక కలలు. పెరుగుతున్న ఆశలతో పాటు తాము సుఖంగా జీవిస్తే అదే పదివేలు అన్నట్టుగా మధ్యతరగతి. ప్రభుత్వం ఇచ్చే కిలో రెండు రూపాయల బియ్యం తినలేక, మార్కెట్‌లో 60 నుంచి 70 రూపాయలు పెట్టి సన్న బియాన్ని కొనలేక తికమక. రోజువారి బడ్జెట్‌ను మార్కెట్లు చిన్నాభిన్నం చేశాయి. ఈ కష్టకాలం కొత్త ఏడాదిలో తీరబోతుందనే నమ్మకంతో వీరంతా ఉన్నారు. కావాల్సినవి సబ్సిడీలు కానేకాదు.. నిఖార్సైన రోజువారీ విధానమే అన్నట్టుగా మొగ్గు చూపుతున్న వారి సంఖ్య పెరిగింది. డిమాండ్ల సాధనతో ఎత్తిన పిడికిలి దింపుతామనే భావనలో ఉద్యోగులు, కార్మికులు. నిరాశ నిస్పృహల నుంచి బయట పడేందుకు నిరుద్యోగుల తపన. ఒకటేంటి అందరికీ కలిసిరావాలనేదే అందరి కళ్లల్లో ఆశ.. ఆకాంక్ష.

## అంతటా న్యూ ఇయర్ జోష్

- రోడ్లపై యువత సందడి.. పండ్లు, పూలు, స్వీట్ల దుకాణాల్లో రద్దీ
- కిటకిటలాడిన బేకరీలు

ఏలూరు సిటీ, డిసెంబరు 31: నూతన సంవత్సర సందడితో జిల్లా వ్యాప్తంగా న్యూఇయర్ జోష్‌తో మారుమోగింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అసలే ఆదివారం కావడంతో వేడుకల సందడి మరింత పెరిగింది. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2024కి జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని వివిధ పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో నూతన సంవత్సర సందడి నెలకొంది. పండ్ల, పూల దుకాణాలు రద్దీగా కనిపించాయి. రకరకాల రంగులలో బొకేలు అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. ఆఫర్లతో బిరియానీ ప్యాకెట్లు అమ్మకాలు చేశారు. బిరియానీ ఫ్రైడ్‌రైస్ కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లు ఇవ్వటం జరిగింది. ఏది కొన్నా ఒక డ్రింక్ బాటిల్ ఉచితంగా అందించారు. ఇక నాన్ వెజ్ ఐటెమ్స్‌కు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. బేకరీ , స్వీట్ షాపులు బిజీబిజీగా కనిపించాయి. నూతన సంవత్సరం ఆరంభానికి సూచనగా చాలా ప్రాంతాలలో ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేకంగా ఫ్లెక్సీలు వెలిశాయి. అర్ధరాత్రి కాగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ యువత సందడి చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల ముంగిట మహిళలు ముగ్గులతో స్వాగతం పలికారు. న్యూఇయర్ సందర్భంగా చర్చిలు, దేవాలయాలకు విద్యుద్దీపాలంకరణలు చేశారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒక సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా గ్రీటింగ్స్ అమ్మకాలపై పడింది. ఈ సారి గ్రీటింగ్స్ అమ్మకాలు బాగా తగ్గాయని చెబుతున్నారు.



ఏలూరులో బిర్యానీ అమ్మకాలు



ఏలూరు విజయవిహార్ సెంటర్లో గాజుల దుకాణం వద్ద..



ముదినేపల్లి వద్ద రోడ్డు పక్కనే పది రోజులుగా బరకాలు కప్పి ఉన్న ధాన్యం రాశులు

## మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

- రోడ్ల పక్కనే ధాన్యం నిల్వలు.. ఒడ్డుకు చేర్చినా ఫలితం లేదు
- నిబంధనలు మార్చాలని రైతుల డిమాండ్

ముదినేపల్లి, డిసెంబరు 31 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు సిద్ధం చేసినా కొనుగోళ్లు మందకొడిగానే సాగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో ఎన్నో కష్టాల నెదుర్కొని పొలాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి ఒడ్డుకు చేర్చిన ధాన్యం అమ్ముడుపోవడం లేదు. తేమలో ఒక్క శాతం కూడా తేడా లేకుండా నిబంధనల మేరకు ధాన్యాన్ని రోజుల తరబడి రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం పెద్దగా శ్రద్ధ చూపించడం లేదని రైతులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లి మండలంలో చాలా గ్రామాల్లో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోలేని దయనీయ పరిస్థితి. పండించిన పంటను సొమ్ము చేసుకోలేకపోతున్నామన్న బాధను వ్యక్తం చేస్తున్నారు. తూకం వేసి సిద్ధంగా ఉంచిన ధాన్యాన్ని కూడా మిల్లుకు చేర్చే అవకాశాలు కరువయ్యాయి. మిల్లుల వద్ద ధాన్యాన్ని అన్‌లోడ్ చేసేందుకు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి రావడంతో ట్రాక్టర్ల యజమానులు కిరాయితోపాటు వెయిటింగ్ ఛార్జి డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వల్ల ధాన్యం నిల్వలు మండలంలో పేరుకుపోతున్నాయి. ముదినేపల్లి - గుడివాడ, కైకలూరు జాతీయ రహదారితో పాటు పలు చోట్ల రోడ్ల వెంబడి పూర్తిగా ఆరబెట్టిన ధాన్యం నిల్వలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఆఫ్‌లైన్ విధానం రద్దు చేసి ఆన్‌లైన్‌లో మాత్రమే కొనుగోళ్లు జరుగుతుండడంతో రైతులు తమకు ఇష్టం వచ్చిన మిల్లుకు ధాన్యాన్ని అమ్మే అవకాశం లేకుండాపోయింది.

### 60 శాతం కొనుగోళ్లు

ముదినేపల్లి మండలంలో సుమారు 16,500 ఎకరాల విస్తీర్ణంలో సార్వా వరి సాగు చేయగా, సుమారు 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందన్నది వ్యవసాయ శాఖ అంచనా. అయితే తుఫాన్ వల్ల సుమారు 8 వేల ఎకరాల్లో పూర్తిగా, పాక్షికంగా పంట నష్టం జరగడంతో సుమారు 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తగ్గింది. దీంతో 33 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అందుబాటులో ఉండవచ్చని డీసీఎంఎస్ అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటి వరకు మండలంలో సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇంకా 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రైతుల వద్ద మూడున్నర వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. సుమారు 12,500 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడికి సంబంధించి వరి కోతలు, వరి కుప్పల నూర్పిళ్లు పూర్తి చేయాల్సి ఉంది. మరో 15 రోజుల వరకు సార్వా కోతలు, నూర్పిళ్లు జరిగే అవకాశం ఉన్నందున నిబంధనలు సడలించకపోతే ధాన్యం అమ్ముకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అన్నీ ఇబ్బందులే : పెందుర్తి వెంకట్రావు, రైతు, ముదినేపల్లి



కష్టపడి పండించిన పంటను అమ్ముకునే స్వేచ్ఛ లేదు. ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు అడ్డంకిగా ఉన్నాయి. వరి కోతలు చేసి ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చేందుకు ఎకరానికి రూ.12 వేలు ఖర్చు అవుతోంది. మిల్లుకు తీసుకెళ్లిన ధర ఎంత నిర్ణయిస్తారో తెలియదు.

### నిబంధనల ప్రకారం కొనుగోళ్లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ప్రస్తుతం రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆర్‌బీకేల సిబ్బంది ద్వారా చర్యలు తీసుకుంటాం.

- విజయ్, డీసీఎంఎస్ మండల ధాన్యం సేకరణ ఇన్‌చార్జ్



ముదినేపల్లిలో అంగన్‌వాడీల పొర్లు దండాలు

## పొర్లు దండాలతో అంగన్‌వాడీల నిరసన

ఏలూరుసిటీ, డిసెంబరు 31 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు జిల్లాలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె రోజురోజుకూ ఉధృత మవుతోంది. జిల్లాలో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరింది. జిల్లాలో పలుచోట్ల వినూత్నంగా అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఏలూరులో పొర్లు దండాలు పెట్టి అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. చాట్రాయిలో అంగన్‌వాడీల నిరసన దీక్షకు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య మద్దతు తెలిపారు. పోలవరంలో ఆటపాటలతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కలిదిండిలో అంగన్‌వాడీల సమ్మెకు మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. చింతలపూడిలో అంగన్‌వాడీలు విన్నూత్న ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలోని లింగపాలెం, పెదపాడు, చింతలపూడి, కైకలూరు, ముదినేపల్లి, పెద వేగి, మండవల్లి, కలిదిండి, కామవరపుకోట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా కార్యక్రమాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తమ నిరసన తెలిపారు.

## కాంట్రాక్టు కార్మికులంతా సమ్మెలోకి..



ఏలూరుటూటౌన్, డిసెంబరు 31: నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరూ ఆదివారం నుంచి విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. ఇప్పటి వరకు సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మద్దతుగా ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది చేరారు. వాటర్‌వర్క్స్, వీధిలైట్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, పార్కుల్లో పని చేసే కార్మికులంతా పాల్గొన్నారు. సీఐటీయూ నాయకుడు జగన్నాథరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచకుండా అన్యాయం చేశారన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం అర్హతలేని ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తున్నారని వారికి ఏదైనా ప్రమాదం జరిగితే కమిషనరే బాధ్యత వహించాలన్నారు.

## వైఎస్సార్ కానుక రూ. 3వేలకు పెంపు : కలెక్టర్

ఏలూరుసిటీ, డిసెంబరు 31: సామాజిక భద్రత కింద జిల్లాలో 2,33,726 మందికి అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక 2024 జనవరి నుంచి మరో రూ.250 పెంచి రూ. 3వేలను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు పూర్తి చేసినట్టు కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ ఆదివారం తెలిపారు. జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజాప్రతినిధుల సమక్షంలో జనవరి 2వ తేదీ నుంచి 8వతేదీ వరకు ఆయా మండలాలు, మునిసిపాలిటీల్లో నిర్వహిస్తామన్నారు. పెంచిన మొత్తం కింద ప్రతి నెలా అదనంగా రూ.5.84 కోట్లు పంపిణీ చేస్తారని, అదే విధంగా వీటితో పాటు జిల్లాలో మిగిలిన ఇతర రకాల పెన్షన్లతో కలిపి మొత్తం 2,87,845 మందికి రూ. 85.94 కోట్లు జనవరి 2వతేదీ నుంచి పంపిణీ చేస్తారన్నారు. ఇందులో జనవరి నెల నుంచి కొత్తగా మంజూరు చేసిన 9,326 పెన్షన్లు ఉన్నాయన్నారు. ఇతర పెన్షన్లు కింద 44వేల 793 మంది లబ్ధి పొందుతున్నారన్నారు.

## సుఖశాంతులతో ఉండాలి: బడేటి

ఏలూరుటూటౌన్, డిసెంబరు 31:నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి రాధాకృష్ణయ్య అన్నారు.























పోలవరం, లింగపాలెంలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

### ఆటపాటలతో అంగన్‌వాడీల

# నిరసన

- హామీ అమలు చేయాలంటూ నినాదాలు, ప్రభుత్వం దిగి వచ్చేవరకు సమ్మె..

పోలవరం, డిసెంబరు 31: అంగన్వాడీల సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. శిబిరం వద్ద ఆటపాటలు పాడి నిరసన వ్యక్తం చేశారు. కబడీ ఆడుతూ సీఐటీయు జిందాబాద్ అన్న నినాదాన్ని కూతగా పెట్టారు. 2024 సంవ త్సర అంకెల రూపం లో మానవహారం నిర్వహించారు. కుమారి, పద్మ, సరస్వతి, హైమావతి, కుబ్రు, జుబేద, వెంకటరమణ, సత్యవతి పాల్గొన్నారు.

● పెదవేగి: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని శపథం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ నినదించారు. సీఐటీయూ నేతలు జె.గోపి, పి.ప్రసాద్ మాట్లాడుతూ, అంగన్‌వాడీల న్యాయ మైన కోర్కెల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బేబీరాణి, కృష్ణవేణి, నిర్మల, త్రివేణి, భార్గవి, సూర్యకుమారి, నిర్మలజ్యోతి, అనంతలక్ష్మి, లావణ్య, యశోద, శ్రావణి, నాగమణి, ఉష, సరోజిని, సుజాత తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం అంగన్‌వాడీలు కబడ్డీ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలోనైనా జగన్ మనసు మారాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా అంటున్న ఆయన తమతో ఆటలు ఆడుతున్నారని అన్నారు.

● కామవరపుకోట అంగన్‌వాడీల దీక్షా శిబిరానికి సీపీఐ కార్యదర్శి టి.వి.ఎస్.రాజు విచ్చేసి సంఘీభావం తెలియచేశారు. తొలుత అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సుభాషిణి, పుష్పరాజ్యం, సరళాదేవి, శాంతి, జగదీశ్వరి, ప్రియాంక, సుజాత, దీప, పద్మ పాల్గొన్నారు.

● గణపవరం: ఆటపాటలతో నిరసన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గీతాలా పనలు చేశారు. రామకోటి, ఝాన్సీ, జయలక్ష్మి, వెంకటలక్ష్మి, కేవీ మహాలక్ష్మి ఉన్నారు.

● ఏలూరు కలెక్టరేట్: కలెక్టరేట్ వద్ద పొర్లుదండాలు పెట్టి వినూత్నంగా నిరసన తెలియజేశారు. అంగన్‌వాడీ యూనియన్ ఏలూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు టి.రజనీ మాట్లాడుతూ, సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోందని, ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. దుర్గాభవానీ, స్వప్న, మల్లిక, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

● చింతలపూడి: సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా శిబిరాన్ని సందర్శించినట్టు చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు టి.బాబు, గంధం అంజమ్మ, మరియమ్మ, విజయలక్ష్మి, నత్తా వెంకటేశ్వరరావు, మాణిక్యం పాల్గొన్నారు.

● కుక్కునూరు : స్థానిక దీక్ష శిబిరం వద్ద అంగన్‌వాడీలు ఆటపాటలతో నిరసన తెలిపారు. సీఐటీయు మండల కార్యదర్శి వై.సాయికిరణ్, వై.నాగేంద్రరావు, కుంజా నాగలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

● పెదపాడు: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు 20వ తేదీ అకృతిలో నేలపై కూర్చొని నిరసన తెలిపారు. తిరుపతమ్మ, శారద, సీతామహాలక్ష్మి, దేవమణి, వినీలా, జ్యోతి, దుర్గ పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినూత్న నిరసన


చెవులు, నోరు, ముక్కు మూసుకుని ఉద్యోగుల నిరసన

ఏలూరు కలెక్టరేట్, డిసెంబరు 31: సమ్మెలో భాగంగా ఆదివారం సమగ్రశిక్ష అభయాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చెవులు, ముక్కు నోరుమూసుకుని వినూత్న నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నోటీసులతో భయపడేది లేదని ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని కోరారు. భగవాన్, కమలాకర్, పౌల్‌రాజు, క్రాంతి, దిలీప్, బాలాజి, రాజు, చినబాబు, శ్రీనివాసరావు, వీరమణి, శ్యామల, ఝాన్సీ వెంకటలక్ష్మి కుమారి, లక్ష్మికాంతం, భవానీ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ వర్కర్ల ర్యాలీ

చింతలపూడి, డిసెంబరు 31 : తమ సమస్యలు పరిష్కరించాలంటూ మునిసిపల్ కార్మికులు ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు టి.బాబు మాట్లాడుతూ, కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెలగాడి అనురాధ, శ్రీరామ్ వెంకటయ్య, వి.బాలు, పలువురు పాల్గొన్నారు.

## సమ్మెలోకి కార్మిక సంఘాల జేఏసీ

ఏలూరుటూటౌన్, డిసెంబరు 31: మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు నిరసనగా జనవరి 3 నుంచి ఏఐటీయూసీ నాయకత్వంలో కార్మిక సంఘాల జేఏసీ సమ్మెలోకి దిగుతుందని యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.విగ్నేష్ తెలిపారు. ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్చల పేరుతో కాలయాపన చేస్తూ ప్రభుత్వం వ్యవహరించటం తగదన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

## 'యువతను నమ్మించి మోసం చేసిన జగన్'

ఏలూరుటూటౌన్, డిసెంబరు 31: అధికారంలోకి రాగానే రెండున్నర లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. ప్రతీ ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ యువతను సీఎం జగన్ దారుణంగా మోసం చేశాడని బీజేపీ యువమోర్చ జిల్లా అధ్యక్షులు నాగసురేష్ ఆరోపించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం అయన మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో 1,345మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో ఆరులక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే 10వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఎం.వంశీకృష్ణ, దాన భాస్కర్, ముఖేష్, భానుప్రకాశ్, చైతన్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## చేపల రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి

ఏలూరుటూటౌన్, డిసెంబరు 31: చేపల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నేభవన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ, మందులు, మేతలు, లీజు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. లక్షల్లో నష్టాలు రావడంతో సన్నా, చిన్నకారు రైతుల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల పై మార్కెట్ సెస్ రూ.500 కోట్ల వరకు పెంచి రైతుల పై భారం వేయాలనే యోచన విరమించుకోవాలని అన్నారు. రొయ్యల రవాణాపై గత ప్రభుత్వం 0.5 శాతం ఉన్న సెస్‌ను ఇప్పుడు 2శాతానికి పెంచాలనుకోవడం దుర్మార్గమన్నారు.

## మహిళల ఆర్థిక ప్రగతికి తపన ఫౌండేషన్ కృషి

టి.నరసాపురం, డిసెంబరు 31 : మహిళల ఆర్థిక ప్రగతికి తపన ఫౌండేషన్ కృషి చేస్తుందని ట్రస్టీ గారపాటి రేణుక అన్నారు. తిరుమల దేవిపేట, శ్రీ రామవరం గ్రామాల్లో ఫౌండేషన్ ద్వారా కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 80 మంది మహిళలకు సర్టిఫికెట్లను ఆదివారం పంపిణీ చేశారు. రఘు, అజయ్, శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందేలు, జూదం ఆడటం నేరం

ఏలూరు కలెక్టరేట్, డిసెంబరు 31: ఏలూరు డివిజన్ పరిధిలో కోడిపందేలు, జూదం, గుండాట ఆడేవారిపై చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్డీవో ఖాజావలి తెలిపారు. ప్రజలు అప్రమత్తమై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## బీటీఏ కేలండర్ ఆవిష్కరణ

ఏలూరు ఎడ్యుకేషన్, డిసెంబరు 31 : బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ముద్రించిన నూతన సంవత్సర కేలండర్, డైరీలను డీఈవో శ్యాంసుందర్ ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రవీంద్ర, బి.మనోజ్‌కుమార్, పి.సాల్మన్, జి.వెంకటేశ్వరరావు, ధర్మలింగం, వెంకటరమణ, కృపాకర్ పాల్గొన్నారు.

● చింతలపూడి: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు, జడ్పీటీసీ ఎం.నీరజ ఆవిష్కరించారు. మండల విద్యాశాఖాధికారులు రామారావు, కిరణ్‌బాబు, ఎస్టీయు నాయకులు శామ్యూల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ జోష్..

- కొత్త సంవత్సరానికి ఘనస్వాగతం
- దుకాణాల వద్ద పండుగ వాతావరణం
- ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఏలూరులో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ..

ఏలూరు కల్చరల్, డిసెంబరు 31: నగరంలో న్యూఇయర్‌జోష్ నెలకొంది. 2023కు వీడ్కోలు.. 2024కు స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం నుంచి సందడి నెలకొంది. స్వీట్లు, కేక్‌లు, పండ్ల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. అర్ధరాత్రి ఆలయాల్లో ప్రత్యేక పూజలకోసం భక్తులు బారులు తీరారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మందుబాబులు సందడి చేశారు. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే టపాసుల మోతల మధ్య కేక్‌లు కట్‌చేసి హ్యాపీ న్యూఇయర్ అంటూ యువత కేరింతలు కొట్టింది. యువకులు బైక్‌ల సైలెన్సర్లు తీసి శబ్దాలు చేస్తూ కేరింతలతో హోరెత్తించారు. ప్రధాన రహదారులను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వన్‌టౌన్, టూటౌన్, మెయిన్ బజారు, ఆర్.ఆర్‌పేట, పవర్‌పేట పరిసర ప్రాంతాలు జనంతో కిటకిటలాడింది. లోగిళ్లను రంగవల్లులతో మహిళలను అలంకరించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ముగ్గులు వేసి అలంకరించారు.

● గణపవరం: నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు గ్రామీణ ప్రజలు సిద్ధమయ్యారు. రెస్టారెంట్లు, బిర్యాని ప్యాకెట్లకు కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌లు ఆఫర్లు ఇస్తున్నారు. గ్రామాలను వేడుకలకు అనుగుణంగా తీర్చిదిద్దారు.

● చింతలపూడి : పట్టణంలో పలు దుకాణాలు ఆఫర్ల ప్రకటనతో రద్దీగా మారాయి. గురుభగట్లగూడెం రోడ్డు, మెయిన్ రోడ్డులో వ్యాపారాలు జోరుగా సాగాయి.

## 17 వరకు శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 31 : స్థానిక రామ చంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారి త్రిసప్తాహ బ్రహ్మో త్సవాలు జనవరి 17 వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ఈవో నాగం సన్యాసిరావు తెలిపారు. స్వామి నిత్య కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. కళావేదికపై బ్రహ్మశ్రీ శ్రీనివాస శాస్త్రి సీతా దర్శనం ప్రవచనాన్ని నిర్వహించారు. దివ్య సుహాసిని శిష్య బృందం కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. వంగల శ్రావణి బృందం నృత్య నీరాజనాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, చక్రవర్తి, సత్యనారాయణాచార్యులు ఉన్నారు.

## రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి, డిసెంబరు 31: రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి.. లలితా సహస్ర నామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. ఈవో ఎన్.సతీష్‌కుమార్ పర్యవేక్షించారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలు

పెదవేగి, డిసెంబరు 31: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే దేవాలయాలని గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథపఠనం చేశారు. గ్రంథాలయానికి రావడం అంటే విజ్ఞానాన్ని పెంచుకోవడమేనని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని, అదే జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందన్నారు.


గుంటుపల్లిలో బ్రోచర్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

## సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

కామవరపుకోట, డిసెంబరు 31: గుంటుపల్లి పంచాయతీ పరిధిలోని కంఠమనేనివారిగూడెంలో ఆదివారం టీడీపీ నేతలు బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చింతలపూడి నియోజకవర్గ నేత సొంగ రోషన్‌కుమార్, గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాసు, బేతిన వెంకట్రావు, కె.అంజిమూర్తి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ బ్రోచర్లను అందజేశారు. కంఠమనేని చిన సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, నాగ రాజు, మల్లికార్జునరావు, బాలకృష్ణ, శీనివాసరావు, డాకూరి వీరభద్రరావు, మందలపు అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

● చింతలపూడి : శెట్టివారిగూడెంలో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జగన్మోహన్‌రావు, మేనేని మోహన్‌రావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవన్‌పై ఆరోపణలు తగదు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 31 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నీతి, నిజాయితీతో చేస్తున్న పోరాట పటిమను చూసి ఓర్వలేక సీఎం జగన్ అండ్ కో అయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, సిరిపల్లి ప్రసాద్ పేర్కొన్నారు. పవరుపేట పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ, చట్టప్రకారం విడాకులు తీసుకున్న తరువాతే పవన్ వివాహం చేసుకున్నారని స్పష్టంచేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. నగిరెడ్డి కాశీ నరేష్, అల్లు సాయిచరణ్, ధర్మేంద్ర, నూకల సాయిప్రసాద్, గుడే జగదీష్, చిత్తిరి శివ ఉన్నారు.














































## దక్షిణ భారత సైన్స్ ఎగ్జిబిషన్‌కు చింతలపూడి విద్యార్థినుల ఎంపిక

▸ రాష్ట్రస్థాయి విజేతలకు ఏలూరు జిల్లా కలెక్టర్ అభినందనలు



విద్యార్థినుల బృందానికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ తదితరులు

ఏలూరు ఎడ్యుకేషన్, డిసెంబరు 31 : రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్ విభాగం ప్రదర్శనల్లో ప్రథమ స్థానంలో నిలిచి దక్షిణభారత సైన్స్ ఎగ్జిబిషన్‌కు చింతలపూడి జడ్పీ హైస్కూలు విద్యార్థినులు ఎంపిక య్యారు. జాతీయ శాస్త్ర, సాంకేతిక మండలి (ఎన్‌సీఎస్‌టీ) ఆధ్వర్యంలో గతనెల 28,29 తేదీల్లో కడపలో నిర్వహించిన గ్రూప్ విభాగం ప్రదర్శనలో ఎంపికైన కె.మహిత, ఎం.శ్రీవర్ధిని, గైడ్‌టీచర్ కె.రవికుమార్‌లను ఆదివారం ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అభినందించారు. ఈ ఏడాది బాలాసోర్, పలాసలలో చోటుచేసుకున్న రెండు ఘోర రైలు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని రైలు ప్రమాదాలను నిరోధించేందుకు ఆటోమేటిక్ ఇంటర్ లాకింగ్ సిస్టం, కవచ్ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో ఈ విద్యార్థినుల బృందం ప్రదర్శనలో చూపించిన విషయం తెలిసిందే.. ఆయా రాష్ట్రస్థాయి పోటీల విజేతలతో జనవరి 27నుంచి ఆరు రోజుల పాటు విజయవాడలో దక్షిణభారత సైన్సు ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఎంపికైన విద్యార్థులు జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌కు అర్హత సాధిస్తారు. ఈ పోటీల్లో సౌత్‌నుంచి మొత్తం 8 రాష్ట్రాల సైన్స్ ఎగ్జిబిషన్‌ల విజేతలు పాల్గొంటారని జిల్లా సైన్స్ ఆఫీసర్ సీహెచ్.ఆర్.ఎం.చౌదరి, డీఈవో పి.శ్యాంసుందర్, స్కూలు హెచ్‌ఎం వడ్లపట్ల మురళీకృష్ణ తెలిపారు.

## నృత్యగురువు నాగమణిబుద్దదేవ్‌కు పురస్కారం అందజేత



అవార్డు స్వీకరించిన నాగమణిబుద్దదేవ్

ఏలూరు కల్చరల్, డిసెంబరు 31: ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యగురువు ఎ.నాగమణిబుద్ద దేవ్ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నారు. నృత్యకళారంగానికి ఆమె చేసిన విశిష్టసేవను గుర్తించి కర్నాటకకు చెందిన శ్రీరాజరాజేశ్వరి సాంస్కృతిక కళాసంస్థ నవసంధి ఆలయ సంప్రదాయ నృత్యప్రదర్శనలో భాగంగా ఆత్మీయగౌరవ సత్కారంతో ఘనంగా సత్కరించారు. బెంగళూరు చౌడప్ప మెమోరియల్ హాల్లో జరిగిన కార్యక్రమానికి కర్నాటక మాజీ ఉపముఖ్యమంత్రి అస్వత్‌నారాయణ, వేదాంతం రామలింగశాస్త్రి, సంస్కృతి కళాశాల నిర్వాహకులు డాక్టర్ వీణామూర్తి, విజయ్ తదితరుల చేతులమీదుగా సత్కారాన్ని అందుకున్నారు. ఆమె పురస్కారం పొందడంపై కూచిపూడి నృత్యగురువులు, శిష్యులు హర్షం ప్రకటించారు.

## గౌరవ వేతనాల బిల్లులు నేరుగా ఇవ్వండి

▸ డీఈవోకు పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల వినతి



డీఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు

ఏలూరు ఎడ్యుకేషన్, డిసెంబరు 31 : సమగ్రశిక్ష ఏలూరు జిల్లా ప్రాజెక్టులో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల నెలవారీ గౌరవ వేతనాల బిల్లులను ఎంఈవోల ద్వారా కాకుండా సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలే నేరుగా జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి పంపేలా ఉత్తర్వులు ఇవ్వాలని పార్ట్‌టైం ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఆదివారం డీఈవో శ్యాంసుందర్‌కు పార్ట్‌టైం ఉద్యోగులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఏపీ పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బోస్, కన్వీనర్ ఎస్.రజనీకాంత్ మాట్లాడుతూ ఇప్పటికే ఈ విధానాన్ని పొరుగున వున్న పశ్చిమ గోదావరి జిల్లాలో అమలు చేస్తున్నారని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. సంఘ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెలలో పార్ట్‌టైం ఆర్ట్, క్రాఫ్ట్ టీఎల్‌ఎం మేళాను ఏలూరులో నిర్వహించనున్నామని దీనికి సహకరించాలని కోరారు. ఉద్యోగుల వినతిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని డీఈవో హామీ ఇచ్చారు. సంఘ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్, పి.సుబ్బారావు, బి.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## 28న సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ

▸ ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక



రామారావు రాజశేఖర్

ఏలూరు ఎడ్యుకేషన్, డిసెంబరు 31 : 'ఓట్ ఫర్ ఓపీఎస్' నినాదంతో ఈనెల 28న చలో విజయవాడ ఆందోళనకు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం సమావేశమైన సంఘ నాయకులు అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సమాలోచనలు చేశారు. అనంతరం సంఘ ఏలూరు జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్.సూర్యకుమార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆర్.రామారావు, ఎన్.రాజశేఖర్, ఆర్థిక కార్యదర్శిగా ఎం.రాంబాబు, సహ అధ్యక్షుడిగా కె.చక్రవర్తి, మహిళా అధ్యక్షురాలిగా బి.మోహనరాణి ఎన్నికయ్యారు. స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా టి.శ్రీప్రసాద్, ఆర్.నాగదుర్గారావు, జి.సాయిశ్రీనివాస్, కె.బుచ్చిబాబు, అదనపు కార్యదర్శిగా ఎం.బెన్‌హర్, అదనపు ఆర్థిక కార్యదర్శిగా ఆర్.రామకృష్ణ, జిల్లా కార్యదర్శులుగా డి.ప్రవీణ్‌మీరా, జి.రాజేష్, ఎ.నయోమిరాణి, కె.శ్రీనివాస్, ఎ.సుధీర్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా కె.శ్యామ్, బి.మణికంఠ, ఎం.కిరణ్, ఎస్.అప్పారావు, వి.వల్లీలను ఎన్నుకున్నారు.



ప్రమాదం సుమీ..!

ద్వారకాతిరుమల మినీ బైపాస్ రోడ్డుపై ప్రయాణిస్తున్న భారీలోడు చెరకు ట్రాక్టరు (ఇన్‌సెట్‌లో) లోడును తప్పించుకుని వెళ్తున్న వాహనదారుడు

ద్వారకాతిరుమలలోని మినీ బైపాస్‌రోడ్డులో కనిపించిన ఈ చిత్రం ప్రమాదాలకు దర్పణంగా నిలుస్తోంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక మినీబైపాస్ రోడ్డు మీదుగా భారీ లోడు వాహనాలు రాకూడదంటూ పోలీసులు ఆదేశాలు జారీ చేయక పోవడంతో చెరకు లోడు, ఆయిల్‌పాం లోడు వాహనాలు యథేచ్ఛగా తిరుగుతూనే ఉన్నాయి. ద్వారకాతిరుమల నుంచి బయటకు వెళ్లే వాహనాలు మినీబైపాస్ మార్గం నుంచి ప్రయాణించకూడదన్న నిబంధనలు పోలీసులు సక్రమంగా అమలుచేయకపోవడంతో వాహనదారులు దర్జాగా అటువైపుగా సంచరిస్తున్నారు. భారీ లోడు వాహనాలతో ఎటువంటి ప్రమాదాలు జరగకముందే పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని పలువురు భావిస్తున్నారు.

- ద్వారకాతిరుమల



## న్యూ ఇయర్ జోష్..



ఏలూరు వన్‌టౌన్‌లో పూలమార్కెట్ రద్దీ



ఆచంటలో కేకులు



ఆగిరిపల్లిలో స్వీట్ల షాపు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పట్టణ, మండల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి న్యూఇయర్ జోష్.. కనిపించింది. స్వీట్లు, కేకులు, పండ్ల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. మందుబాబులు సందడి నెలకొంది. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే టపాసుల మోతల మధ్య కేకులు కట్‌చేసి హ్యాపీ న్యూఇయర్ అంటూ యువత కేరింతలు కొట్టింది. ఇంటి లోగిళ్లను మహిళలు రంగవల్లులతో అలంకరించారు.



భీమవరంలో కేకుల దుకాణం



ఏలూరులో ఫ్రూట్స్ షాపు



భీమవరంలో బిర్యాని సెంటర్



ముదినేపల్లిలో నాన్‌వెజ్



ఏలూరు స్వీట్స్ షాపులో..

## 3న మంగళగిరిలో సర్పంచ్‌ల రాష్ట్రసదస్సు

▸ పంచాయతీ చాంబర్ ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గోపాలరావు



సమావేశంలో మాట్లాడుతున్న కదలి గోపాలరావు, తదితరులు

ఏలూరు రూరల్, డిసెంబరు 31 : కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రప్రభుత్వం తక్షణమే పంచాయతీలకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల మూడో తేదీన మంగళగిరిలో సమర శంఖారావం పేరుతో సర్పంచ్‌ల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు పంచాయతీ చాంబర్ ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు కదలి గోపాలరావు తెలిపారు.ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరిలోని సీకే ఫంక్షన్‌హాల్లో పంచాయతీరాజ్ సర్పంచ్‌లు, పంచాయతీ రాజ్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామ న్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ఛార్జీలకు పంచాయతీల నిధులు సర్దుబాటు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం వైసీపీ ప్రభుత్వం అక్రమంగా దోచేసిందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లను పంచాయతీలో విలీనం చేయాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రూ.15వేలు, జడ్పీటీసీ, ఎంపీపీలకు రూ.30వేలు జీతం పెంచాలని డిమాండ్ చేశారు. 16 డిమాండ్ల సాధనకోసం మంగళగిరిలో రాష్ట్రసదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సదస్సుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.బి రాజేంద్రప్రసాద్ తదితరులు హాజరవుతారని, ఉభయగోదావరి జిల్లాల నుంచి సర్పంచ్‌లు హాజరై సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్‌లు అడపా శ్రీనివాసరావు, నెక్కళపు సురేష్‌బాబు, సూర్యచంద్రరావు, రేకపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా... అధ్యయనోత్సవాలు



శ్రీవారు, అమ్మవార్ల వద్ద సేవాకాలం జరుపుతున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 31: శ్రీవారి క్షేత్రంలో ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్స వాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఉభయదేవేరులతో స్వామివారిని తొళక్క వాహనంపై ఉంచి అలంకరించి నిత్య కల్యాణమండప ఆవరణలోకి తెచ్చారు. మండపంలో ఏర్పాటు చేసిని వేదికపై ఉంచిన బంగారుసింహాసనంపై ఉత్సవమూర్తులను ఉంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనను అర్చకులు జరిపారు. అనంతరం నవకలశస్నపన, అభిషేకాలు నిర్వహించారు. ఆతరువాత తిరుమంజనాలు జరిపి స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చారు. ఆలయ అర్చకులు, పండితులు సేవాకాలాన్ని జరిపి భక్తులకు తీర్థ, ప్రసాదవితరణ జరిపారు. అనంతరం రాత్రి శ్రీవారి తిరువీధిసేవ క్షేత్రంలో వైభవంగా జరిగింది.



బహుమతులు అందుకున్న వారితో నిర్వాహకులు, ప్రముఖులు

## విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

భీమవరంటౌన్,డిసెంబరు 31:బాలోత్సవములు వంటి ద్వారా శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తలు తయారు కావాలని పలువురు వక్తలు అన్నారు. భీమవరం పట్టణంలోని చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో బాలోత్సవం కార్యక్ర మంలో భాగంగా రెండోరోజు ఆదివారం జాతీయ పతాకాన్ని రాజా రామ్మోహన్‌రాయ్ ద్విశత జయంతి డిగ్రీ కళాశాల గత కాలపు ప్రిన్సిపాల్ ఎస్వీ రమణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రమణారావు మాట్లాడుతూ భీమవరం ప్రాంతంలో స్వాతంత్ర్య సమర యోధులతో పాటు ప్రముఖ శాస్త్రవేత్తలు పద్మభూషణ్ లు స్వామి జ్ఞానానంద, అయ్యగారి సాంబశివరావు, ఎల్లాప్రగడ సుబ్బారావు వంటి వారు జన్మించి ప్రపంచానికి ఎన్నో సేవలు అందించారన్నారు. అటువంటి వారి ప్రేరణ బాలోత్సవంలో బాలలకు అందించాలన్నారు. సంగీత విద్వాంసుడు, గాయకుడు పిప్పళ్ళ ప్రసాద్ 'రఘుపతి రాఘవ రాజారాం.. పతీత పావన సీతారాం' సమర గేయాన్ని ఆలపించారు. మ్యాజిక్ స్టార్ దంతులూరి బోసు మ్యాజిక్ షో చిన్నారులను ఆకట్టుకుంది. జీపీసీ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో రోప్ స్కిప్పింగ్ ప్రదర్శన నిర్వహించిన అనంతరం సత్కరించారు. శనివారం నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెమెంటోలు ప్రశంసా పత్రాలను డీఈవో ఆర్‌వీ రమణారావు అందించారు. బాలోత్సవం అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు, కార్యదర్శి సీహెచ్ పట్టాభిరా మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గాతల జేమ్స్, చెరుకువాడ రంగసాయి, చైతన్య ప్రసాద్, సీహెచ్ సాయిరాం, అల్లూరి అరుణ్, జి.ధనుష్, కలిగట్ల గోపాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

## పది మంది జూదరుల అరెస్ట్

చింతలపూడి, డిసెంబరు 31:మేడిశెట్టివారిపాలెం సమీపంలోని పామాయిల్ తోటలో పేకాట స్థావరంపై చింతలపూడి పోలీసులు ఆదివారం దాడి చేసి పది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.24,550, ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## వ్యక్తిపై దాడి

భీమవరం క్రైం, డిసెంబరు 31 : భీమవరం బస్టాండ్‌లో ఓ వ్యక్తిపై ముగ్గురు దాడి చేశారని సీఐ అడబాల శ్రీను ఆదివారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు.

## బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం



బాలుడి కుటుంబ సభ్యులకు విరాళం అందిస్తున్న కాన్వెంట్ యాజమాన్యం

మొగల్తూరు, డిసెంబరు 31: మొగల్తూరుకు చెందిన కొత్తలంక క్రాంతి కుమార్ అనే నాలుగు సంవత్సరాల బాలుడు ఇటీవల రెండు అంతస్థుల భవనం పైనుంచి ప్రమాద వశాత్తూ జారి పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతని తల్లిదండ్రులు విజయవాడలోని రెయిన్‌బో ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నారు. బాలుడి తండ్రి సుబ్రహ్మణ్యం కమ్మరి పని చేసుకుని జీవిస్తున్నాడు. కోమాలో ఉన్న బాలుడి వైద్యానికి తల్లిదండ్రులు అప్పులు చేసి రూ.10లక్షలు వరకూ ఖర్చు చేశారు. ఇంకా వైద్యానికి రూ.20లక్షలు ఖర్చుచేస్తేగాని బతికే పరిస్థితి లేదు. బాలుడు చదువుతున్న మొగల్తూరు మాంటిస్సోరి స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు వితరణ చాటారు. వారి ఆర్థిక సహకారంతో పాటు వారి బంధుమిత్రులు గ్రామస్థుల నుంచి రూ.లక్షా 30వేల విరాళాన్ని సేకరించారు. ఈ మొత్తాన్ని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ జక్కంశెట్టి బాబూరావు బాలుడు పెద్దనాన్న అవినాష్‌కి అందించారు. వైద్యానికి ఆర్థిక సహాయం చేసే దాతలు 95021 40989 లేదా 92988 03876కు ఫోన్‌పే చేసి సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## ఉద్యమాల నేత సాబ్జి : మోషేన్



మాట్లాడుతున్న మోషేన్‌రాజు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 31: ఎమ్మెల్సీ సాబ్జి ఉద్యమాల నేతగా శాశన మండలిలో తన గళం విప్పి ప్రజా, ఉద్యోగ సమస్యల పరిష్కారానికి తపించేవారని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సాబ్జి సంస్మరణ సభలో ఆయన పాల్గొని సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి గోపిమూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ విజయరామరాజు, ఏకేవీ రామభద్రం తదితరులు ప్రసంగించారు.

## ఏలూరు స్టేషన్‌లో 'అమృత భారత్ రైలు'

ఏలూరు క్రైం, డిసెంబరు 31 : భారతదేశంలోనే రెండోవ అమృత భారత్ రైలు(మాల్డా టౌన్ నుంచి ఎస్ఎవీటీ బెంగళూరు)ను గత నెల 29వ తేదీన మాల్డా టౌన్‌లో ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ రైలు ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఏలూరు రైల్వేస్టేషన్‌కు చేరుకోగా పలు పార్టీ నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. తిరిగి ఏలూరు నుంచి వెళ్లేందుకు జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జెండా ఊపి ప్రారంభించారు. ఏలూరు రైల్వేస్టేషన్ మేనేజర్ రమేశ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడు కేక్‌ల వితరణ



నూజివీడు, డిసెంబరు 31: ఆగిరిపల్లి మండలంలోని చర్చిలకు టీడీపీ ఆగిరిపల్లి మండల ప్రతినిధి మాదల సత్యకుమార్ సుమారు 300 కేక్‌లు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు జన్యావుల రాజశేఖర్, ముల్లంగి శ్రావణ్ కుమార్, బట్టుమర్తి రవీంద్ర పాల్గొన్నారు.

## సీఎం పదవిపై తీర్మానం

▸ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య

పాలకొల్లు, డిసెంబరు 31: '2024 సంవత్సరంలో జనసేన-తెలుగుదేశం కూటమి విజయం సాధిస్తే పదవుల పంపకం జరిపించవలసినదిగా టీడీపీ అధినేత చంద్రబాబును కోరుతూ తీర్మానం చేశాం.. మొదటి రెండున్నరేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగాను పవన్ కల్యాణ్‌కు లా అండ్ ఆర్డరు, హోమ్, రెవెన్యూ పోర్టు పోలియోలతో సహముఖ్యమంత్రిగా నియమించాలి.. తర్వాత రెండున్నరేళ్లు పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రిగా లోకేశ్ సహ ముఖ్యమంత్రిగా అధికారం పంచుకోవాలి' అని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. ఆదివారం పాలకొల్లులో కాపు సంక్షేమ సేన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆయా జిల్లాల కో-ఆర్డినేటర్లు, జిల్లాల అధ్యక్షులు, పలు రంగాల అధ్యక్షులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టులో కాపులకు రిజర్వేషన్లు కలుగచేసే విషయంలో కాపు సంక్షేమ సేన తరపున వేసిన పిటీషన్‌పై జరుగుతున్న విచారణలోని వివిధ పరిణామాలను, ప్రభుత్వం తమ కౌంటర్‌లో కాపులకు వ్యతిరేకంగా పోరాడుతున్న అంశాన్ని సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఇకపై కాపు సంక్షేమ సేన కాపు, తూర్పుకాపు సంక్షేమ సేనగా రూపు దిద్దుకోవటానికి తీర్మానించారు. 2024 ఎన్నికలలో కాపు సంక్షేమ సేన జిల్లా, నియోజకవర్గ కమిటీలు ఇతర కాపు సంఘాలను, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులస్తులను కూడా కలుపుకుని జనసేన- తెలుగుదేశం కూటమిని నెగ్గించటానికి కృషి చేయాల్సిందిగా తీర్మానించారు.

## ఆక్వా రైతుల సమస్యలు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్తాం

▸ ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు



ఫిషరీస్ ప్రతినిధులను సత్కరిస్తున్న ఆక్వా రైతులు

గణపవరం, డిసెంబరు 31: ఆక్వా రైతుల సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. ఆదివారం గణపవరం రైతు భరోసా కేంద్రంలో విశాఖపట్నం నుంచి వచ్చిన సంస్థ ప్రతినిధులు ఎ.ఉదయకుమార్, ఎంఆర్ఎస్ బాబు ఆక్వా రైతులు, మత్స్య సహకార సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. సాగులో ఎదుర్కొంటున్న సమస్యలును అడిగి తెలుసుకున్నారు. కిసాన్ క్రెడిట్‌కార్డు రుణాల పంపిణీ కూడా తెలియజేశారు. తమ సమస్యలన్ని కూడా ఈనెల రెండో తేదీన భీమవరం వస్తున్న కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం దృష్టికి తీసుకెళ్తామని ప్రతినిధులు తెలిపారు. అనంతరం రైతులు వారిని సత్కరించారు. గణపవరం మత్స్యశాఖాధికారి శివరామకృష్ణ, గ్రామ మత్స్య సహాయకులు షర్మిలాదేవి, భాస్కర్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## శనివారపుపేటలో చోరీ

ఏలూరు క్రైం, డిశంబరు 31 :ఇంటికి రాత్రి వేళ తాళం వేసి ఉదయం వచ్చేసరికి దొంగలు ఆ ఇంటిని దోచేశారు. ఏలూరు శనివారపుపేటలోని దాసాంజనేయస్వామి గుడి సమీపంలో నివాసం ఉంటున్న మామిళ్ళ వెంకట నాగ సత్యనారాయణ డిసెంబరు 30వ తేదీ రాత్రి 8 గంటలకు తాళం వేసి సమీపంలో ఉన్న దొండపాడులోని తన తల్లి ఇంటికి వెళ్లి ఆదివారం ఉదయం వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని 9 కాసుల బంగారం, అరకేజీ వెండి దొంగలు అపహరించుకు పోయారు. ఈ ఘటనపై ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మంచు కురిసే వేళలో..

పెదపాడు, డిసెంబరు 31 : వారంరోజులుగా తెల్లవారుజాము నుంచి సూర్యోదయం వరకు దట్టమైన మంచు కురుస్తుంది. ఉదయం ఏడెనిమిది గంటలవుతున్నా దట్టమైన మంచు గుప్పెట్లో గ్రామాలు దాక్కుంటున్నాయి. దట్టమైన మంచుతో వాహనదారులు ఇబ్బందులెదుర్కొంటున్నారు. ముందు వచ్చే వాహనాల రాకపోకలు కన్పించకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. ఈ మంచు పైర్ల సాగుకు కొంతవరకు నష్టం కలిగిస్తుందని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.



పెదపాడులో మంచు దృశ్యాలు

## మిర్చికి మిచౌంగ్ దెబ్బ



**ఎండుతున్న తోటలు**

**ఆందోళనలో రైతులు**

**నేలకొరిగిన మొక్కలు**

**పెట్టుబడి కూడా రాదని దిగాలు**

కుక్కునూరు, డిసెంబరు 31 : మిర్చి రైతాంగం కష్టాలను ఎదుర్కొంటున్నారు. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనపడడం లేదు. గత నెల మొదటి వారంలో వచ్చిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావం ఇంకా మిర్చి పంటను వెంటాడుతోంది. క్రమేపీ మిర్చి తోటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట అనుకూలంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన తుఫాన్ ప్రభావం పంటను తీవ్రంగా దెబ్బతీసింది. రాత్రికి రాత్రే 20 సెంటీమీటర్ల వర్షం కురవడం, గాలి వీచడంతో పూత నేలరాలింది. కాయలతో ఉన్న చెట్లు నేలకొరిగాయి. ప్రస్తుతం దిగుబడి తగ్గే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు చీడపీడలు అధికమవ్వడంతో పంటలను రక్షిం చుకునేందుకు రైతాంగం పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. అయినప్పటికీ వేలాది ఎకరాల్లో మిర్చి మొక్కలు క్రమేపీ ఎండిపోతున్నాయి. వేరుకుళ్ల తెగులుతో మొక్కలు ఎండిపోతున్నట్టు రైతులు చెబుతున్నారు.

**ఆరంభం నుంచి కష్టాలే...**

కుక్కునూరు మండలంలో ఈ ఏడాది దాదాపు ఎనిమిది వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. గోదావరి తీర ప్రాంతం నల్లరేగడి భూముల్లో ఎక్కువగా మిర్చి సాగు అవుతుంది. గోదావరి భయం ఉండడంతో గత ఏడాది సెప్టెంబరు మొదటి వారం వరకు చూసి మిర్చి సాగు ఆరంభించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. సెప్టెంబరు, అక్టోబరుల్లో వర్షాలు కురవకపోవడంతో మిర్చి మొక్కలు ఎండి పోయే పరిస్థితి ఏర్పడింది. మిర్చి తోటలకు తడులు పెట్టేందుకు రైతాంగం తీవ్రంగా శ్రమించి పంట లను కాపాడుకున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కొత్తగా డీజిల్ ఇంజన్‌లు పైపులు కొనుగోలు చేశారు. కిలోమీటర్ల కొద్దీ పైపులైన్‌లు వేసి తడులు పెట్టారు. వీటి కొనుగోలు కోసం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు రూ.1.50 కోట్లకు పైగా రైతాంగం వెచ్చించినట్టు అంచనా. దిగుబడులు వస్తాయని ఆశించిన సమయంలో మిచౌంగ్ తుఫాన్ పంటపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పటికే ఎకరాకి కౌలు ధర, ఇతరేత్ర సాగు కోసం ఎకరానికి రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టారు. ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు.పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతాంగం దిగాలు చెందుతున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి**



మిర్చి పంట ఆశాజనకంగా ఉన్న సమయంలో తుఫా న్ దెబ్బతీసింది. పూత, కాయంతా రాలిపోయింది. ఎకరాకు ఐదు క్వింటాళ్లకు పైగా ముందే నష్టపోయాం. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-సోడే రాజు, రైతు-లంకాలపల్లి




# 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024





## టీడీపీతోనే బలహీనవర్గాల అభ్యున్నతి

నూజివీడు, డిసెంబరు 31: బడుగు, బలహీన వరాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్య మని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నూజివీడు నియోజక వర్గ ఇన్‌చార్జ్ ముద్దర బోయిన వెంకటేశ్వర రావు అన్నారు. నూజివీడు మండలం మీర్జాపురం, మర్రి బంధం, పల్లెర్లమూడి, సీతారాం పురం గ్రామాల్లో బాబు ష్యూరి టీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్డు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రన్న పెండ్లి కానుక, కార్పొరేషన్లతో ఉపాధి అవకాశాలతో పాటు ఆయా వర్గాల రాజకీయ అభివృద్ధికి రిజర్వేషన్లు కల్పించిందన్నారు. బీసీ సంక్షేమానికి రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తానన్న జగన్ మొండి చేయి చూపాడన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక బీసీ రక్షణ చట్టాన్ని తేవడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు.


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముద్దరబోయిన






















## 'మానవత' చేయూత



కైకలూరు, డిసెంబరు 31: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మానవత కృషి చేస్తోందని సంస్థ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ అన్నారు. ఆదివారం కైకలూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఐదుగురు విద్యార్థులకు రూ.40 వేలు ఆర్థిక సాయం, సైకిల్‌ను అందజేశారు.

**కలిదిండి:** అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళకు వైద్యం నిమిత్తం రూ.5 వేలు కలిదిండి మానవత సేవా సంస్థ అధ్యక్షుడు గోదావరి సత్యనారాయణ గుర్వాయిపాలెంలో జరిగిన సమావేశంలో ఆర్థిక సాయమందించారు. మూల్లంక సర్పంచ్ విజయ్ బాబు రూ.1000 ఆర్థిక సాయం చేశారు.



## టీడీపీ నాయకుడు కేకల వితరణ

నూజివీడు, డిసెంబరు 31: ఆగిరిపల్లి మండలంలోని చర్చిలకు టీడీపీ ఆగిరిపల్లి మండల ప్రతినిధి మాదల సత్యకుమార్ సుమారు 300 కేక్‌లు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు జన్యావుల రాజశేఖర్, ముల్లంగి శ్రావణ్ కుమార్, బట్టుమర్తి రవీంద్ర పాల్గొన్నారు.









## 'తపన' గజ్జెలు, దుస్తుల వితరణ

ముసునూరు, డిసెంబరు 31: గోగులంపాడులో కోలాటం గురువు దాసరి మాణిక్యాలరావు ఆధ్వర్యంలో కోలాటం నేర్చుకున్న 40 మందికి తపన ఫౌండేషన్ ఛైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి సతీమణి రేణుక గజ్జెలు, దుస్తులను అందజేసి మాణిక్యాలరావును సత్కరించారు.

## 'కేంద్రం నిధుల దారి మళ్ళింపు'

ముసునూరు, డిసెంబరు 31: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కార్పొరేషన్ సబ్ ప్లాన్ నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్ళించి పేద, మధ్య తరగతి కుటుంబాల ఉపాధికి గండికొట్టిందని బీజేపీ జిల్లా కార్యదర్శి మాగంటి వాసు మాస్టారు విమర్శించారు. ఆదివారం మండలంలోని చెక్కపల్లి, చింతలవల్లి గ్రామాల్లో భారత్ వికసిత్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లకు సబ్‌ప్లాన్ నిధులు కోట్లాది రూపాయలు విడుదల చేస్తే సీఎం జగన్ వాటిని దారిమళ్ళించారన్నారు. దీంతో అనేక మంది ఉపాధి కోల్పోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




















# 3న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర సదస్సు : కాపా

నూజివీడు టౌన్, డిసెంబరు 31: రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా భవిష్యత్ కార్యాచరణకు జనవరి 3న తాడేపల్లిలో పంచాయతీరాజ్ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు నూజివీడు డివిజన్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాపా శ్రీనివాసరావు తెలిపారు. తాడేపల్లి సీకే ఫంక్షన్ హాల్లో ఆ రోజు మధ్యాహ్నం 1 గంట నుంచి సంఘం అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సదస్సు జరుగుతుందని, ముఖ్య అతిథిగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరు కానున్నారని, రాజకీయాలకతీతంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు. పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వకపోగా కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లను దారి మళ్ళించి వాడుకోవడంపై భవిష్యత్ కార్యాచరణను ఈ సదస్సులో నిర్ణయిస్తామన్నారు.

## ఆరో రోజుకు మునిసిపల్ కార్మికుల దీక్షలు



నూజివీడు టౌన్, డిసెంబరు 31: సీఐటీ యూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె, దీక్షలు ఆదివారం 6వ రోజుకు చేరుకున్నాయి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయలక్ష్మి మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దుచే యాలన్నారు. సీఐటీయూ కార్యదర్శి జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు కామినేని మద్దతు



కలిదిండి, డిసెంబరు 31 : అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కలిదిండిలో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

## చిన్నం మద్దతు.. ఆర్థిక సాయం



చాట్రాయి: అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య కోరారు. ఆదివారం చాట్రాయి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల 20వ రోజు నిరసన దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపి, దీక్షా శిబిరం నిర్వహణకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

## పొర్లు దండాలతో నిరసన

ముదినేపల్లి, డిసెంబరు 31: నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం ముదినేపల్లిలో అంగన్‌వాడీ ఉద్యోగులు పొర్లు దండాలతో నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు సూరపనేని అరుణకుమారి, బండి పద్మ, మణి, రెబ్ పా, కొలంగాని జయలక్ష్మి తదితరుల ఆధ్వర్యంలో తొలుత నిరసన ప్రదర్శన నిర్వహించి పొర్లు దండాలు జరిపారు.

## ఆటలాడుతూ..

కైకలూరు: కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం 20వ రోజుకు చేరాయి. ఆదివారం ఆటలాడి, పాటలు పాడి నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పి. సుజాత, ఎల్. మీనాకుమారి, విజిత, తదితరులు పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్:** ప్రభుత్వం ఎన్ని ఒత్తిడిలు తీసుకువచ్చినా డిమాండ్ల సాధించేవరకు సమ్మెబాట వీడమని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురా లు ఆదిలక్ష్మి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యా లయం వద్ద నిరసన దీక్షను కొనసాగించారు. సీఐటీ యూ అధ్యక్షులు హనుమాన్లు, అంగన్‌వాడీ యూని యన్ నాయకులు పాల్గొన్నారు.

**ముసునూరు:** అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడా లని యూనియన్ నియోజక వర్గ కార్యదర్శి పి.రాజకుమారి అన్నారు. ముసునూరులో అంగన్‌వాడీలు 20 అంకె ఆకృతిలో కూర్చుని నిరసన తెలిపారు. తమ డిమాం డ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే భవిష్యత్తులో తీవ్రపరిణామాలు తప్పవని అంగన్‌వాడీలు హెచ్చరించారు. ఈ దీక్షలో యూనియన్ నాయకులు విద్యావతి, శ్యామల, దుర్గ పాల్గొన్నారు.